సాక్షి సంగారెడ్డి

బుధవారం। 4। జనవరి। 2023



లక్ష్యం 50 వేల ఎకరాలు

రైతులకు దీర్ఘకాలిక ఆదాయం అందించే ఆయిల్‌పామ్ సాగుపై ప్రభుత్వం దృష్టి సారించింది. రైతులను సాగువైపు మళ్లించేందుకు అవగాహన కల్పిస్తోంది. 8లో



ఔటర్‌పై అత్యవసర వైద్యసేవలు

ఓఆర్ఆర్‌పై ప్రమాదాల నియంత్రణకు హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. ప్రతీ 8 కి.మీకు ఒక అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. 8లో

నేడు లూయిస్ బ్రెయిలీ జయంతి

సంగారెడ్డి టౌన్: అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను కలెక్టరేట్ ప్రాంగణంలో బుధవారం నిర్వహిస్తున్నట్టు జిల్లా సంక్షేమ అధికారి పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శరత్ పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లాలోని అంధులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ట్రైడెంట్‌లో క్రషింగ్ జోరు

- ఇప్పటివరకు 1.45 లక్షల టన్నుల చెరకు క్రషింగ్
- హామీ మేరకు బిల్లుల చెల్లింపులు
- పక్క రాష్ట్రాలకు తరలించొద్దని రైతులకు విన్నపం
- ఇక్కడి చెరకును ఇతర కర్మాగారాలు తీసుకోవద్దని ఆదేశాలు



క్రషింగ్‌కు వచ్చిన చెరకు

జహీరాబాద్: జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామంలోని ట్రైడెంట్ కర్మాగారంలో చెరకు క్రషింగ్ జోరందుకుంది. ఇప్పటివరకు 1.45 లక్షల టన్నుల మేర గానుగాడించారు. 2022 – 23 సీజన్‌కు సంబంధించి క్రషింగ్‌ను నవంబర్ 12న ప్రారంభించారు. సామర్థ్యం మేరకు రోజుకు 3,500 టన్నుల మేర క్రషింగ్ జరుపుతోంది. ఈ మేరకు క్రషింగ్ జరపడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తుండగా, యాజమాన్యానికి ఆత్మస్థైర్యం పెరిగినట్లయింది. మూడేళ్లుగా రైతులు పక్క రాష్ట్రాలకు చెరకు తరలించడం వల్ల ట్రైడెంట్ కర్మాగారం పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. యాజమాన్యం ప్రతిష్టాత్మకంగా తీసుకొని క్రషింగ్ కొనసాగించడంతో రైతులకు కర్మాగారం పట్ల నమ్మకం ఏర్పడింది. దీంతో రైతులు ట్రైడెంట్‌కు చెరకును సరఫరా చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

- గత ఏడాది క్రషింగ్‌ను ఆలస్యంగా ప్రారంభించడంతో కేవలం 2.07లక్షల టన్నులు మాత్రమే చెరకు గానుగాడించారు. ఈ సీజన్‌లో మాత్రం 4.50లక్షల టన్నుల మేర చెరకు పంటను గానుగాడించాలని యాజమాన్యం లక్ష్యంగా పెట్టుకుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని క్రషింగ్‌ను ముందస్తుగా ప్రారంభించారు.
- కర్మాగారం జోన్ పరిధిలో సుమారు 18వేల ఎకరాల్లో చెరకు పంట సాగవుతుంది. రైతులు పక్క రాష్ట్రాలకు చెరకును తరలించకుండా ట్రైడెంట్ కర్మాగారానికే తరలించుకునేలా యాజమాన్యం ప్రయత్నాలు చేపట్టి సఫలీకృతం అయింది. రైతుల భవిష్యత్, కర్మాగారం మనుగడను దృష్టిలో పెట్టుకొని ట్రైడెంట్ కర్మాగారానికే చెరకును సరఫరా చేయాలని యాజమాన్యం కోరుతోంది. పక్క రాష్ట్రాలకు చెరకు తరలిస్తే బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరిగి ఇబ్బందులు పడే బదులు స్థానికంగా ఉన్న కర్మాగారానికే తరలించుకోవడం శ్రేయస్కరమని సూచించడంతో రైతులు సానుకూలంగా స్పందించారు. దీంతో ఎలాంటి బ్రేక్‌డౌన్‌లు లేకుండా క్రషింగ్ కొనసాగుతోంది. దీంతో ఇటు రైతులు, అటు యాజమాన్యం సంతృప్తిలో ఉన్నారు.

నెలలోపే బిల్లుల చెల్లింపు

రైతులకు యాజమాన్యం ఇచ్చిన మాట మేరకు బిల్లులను విడుదల చేస్తోంది. రైతులు కర్మాగారానికి చెరకు సరఫరా చేసిన నెల రోజుల్లోపే బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చింది. దీంతో ఈ మేరకు బిల్లులు చెల్లిస్తూ వస్తోంది. ఇప్పటివరకు రూ.22 కోట్ల మేర చెరకు బిల్లులను రైతులకు యాజమాన్యం చెల్లించింది. టన్ను చెరకు ధర రూ.3,270గా నిర్ణయించారు. ఇందులో రూ.3వేల వంతున బిల్లులు చెల్లిస్తోంది. మిగిలిన రూ.270 క్రషింగ్ ముగిసిన అనంతరం చెల్లిస్తామని క్రషింగ్ ప్రారంభ సమయంలో యాజమాన్యం ప్రకటించింది.

పక్క కర్మాగారాలకు ఆదేశాలు

జహీరాబాద్ ప్రాంతంలోని చెరకు ఉత్పత్తులను పక్కనే ఉన్న కర్మాగారాలు తీసుకోరాదని కేన్ కమిషనరేట్ ఆదేశాలు జారీ చేసింది. జహీరాబాద్ ప్రాంత చెరకు రావడం వల్లే సంగారెడ్డిలోని గణపతి చక్కెర కర్మాగారంలో యాడ్ బ్యాలెన్స్ పెరిగిపోతోందని, దీంతో రెండు మూడు రోజుల పాటు చెరకు క్రషింగ్‌కు నోచుకోకుండా ఉండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని విచారం వ్యక్తం చేసింది. జహీరాబాద్ ప్రాంత చెరకు ఏ మాత్రం తీసుకోవద్దని గణపతి యాజమాన్యాన్ని హెచ్చరించింది. అంతేకాకుండా కొత్తకోటలోని కృష్ణవేణితో పాటు మాగి, గాయత్రి, మన్నెకల్లి ప్రాంత కర్మాగారాలు సైతం జహీరాబాద్ ప్రాంత చెరకును తీసుకొని ట్రైడెంట్ కర్మాగారాన్ని నష్టపరచవద్దని ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించింది.

క్రషింగ్ సంతృప్తికరంగా జరుగుతోంది



ట్రైడెంట్ చక్కెర కర్మాగారంలో క్రషింగ్ సంతృప్తికరంగా సాగుతోంది. సామర్థ్యం మేరకు గానుగాడిస్తున్నారు. నేను ఇప్పటివరకు కర్మాగారానికి 1,000 టన్నులకు పైగా చెరకు సరఫరా చేశా. ఇంకా 400 టన్నుల వరకు ఉంది. బిల్లులు కూడా ఇచ్చిన మాట ప్రకారం చెల్లింపులు చేస్తున్నారు. గత రెండు సీజన్ల కంటే ఈ సీజన్‌లో కర్మాగార యాజమాన్యం పనితీరు సంతోషకరంగా ఉంది. యార్డు బ్యాలెన్స్ పెరగకుండా పరిమితంగా పర్మిట్లను జారీ చేసినట్లయితే మరింత సౌలభ్యంగా ఉంటుంది.

– వెంకట్‌రెడ్డి, రైతు, హోతి(కె)

దళారులను ఆశ్రయించవద్దు



రైతులు చెరకును తరలించుకునేందుకు మధ్య దళారులను ఆశ్రయించి నష్టపోవద్దు. దళారులు పక్క రాష్ట్రాలకు చెరకును తరలించి సకాలంలో బిల్లులు చెల్లించకుండా ఇబ్బంది పెడతారు. విధిగా ట్రైడెంట్ కర్మాగారానికే చెరకును సరఫరా చేయాలి. యాజమాన్యం బిల్లులను వెంటవెంటనే విడుదల చేస్తోంది. జహీరాబాద్ ప్రాంత చెరకును పక్క కర్మాగారాలు తీసుకోవద్దు. యాజమాన్యాలు దిక్కరిస్తే చట్టపరంగా చర్యలు చేపడతాం. కర్మాగారంలో క్రషింగ్ ఆశించిన మేరకు సాగుతోంది. చివరి గడ వరకు క్రషింగ్ పూర్తిచేస్తాం.

– రాజశేఖర్, అసిస్టెంట్ కేన్ కమిషనర్, సంగారెడ్డి

ఆస్పత్రి సేవలపై క్షేత్రస్థాయి పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న కాయకల్ప బృందం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని మంగళవారం కాయకల్ప బృందం సభ్యులు ఆకస్మికంగా పరిశీలించారు. ఆస్పత్రిలో అన్ని విభాగాల నిర్వహణ సక్రమంగా ఉందని కాయకల్ప బృందం నిర్వాహకుడు,భైంసా సూపరింటెండెంట్ కాశీనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి రోగులు ఎక్కువగానే వస్తున్నారని పరిశీలనలో తెలుసుకున్నామన్నారు. ఈ పరిశీలనలో ఆస్పత్రి ఎంపికైతే రాష్ట్రస్థాయి బృందం మళ్లీ వచ్చి పరిశీలిస్తుందని తెలిపారు. ఇందులో మంచి మార్కులు సాధిస్తే ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన సేవలే లక్ష్యమని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేసేలా ఈ పరిశీలన ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రేవంత్, ఆర్ఎంఓ ప్రవీణ పాల్గొన్నారు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం 15 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 14 మందికి నిర్వహించినట్లు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

'కేతకి'కి చేరిన పాదయాత్ర



భజన చేస్తున్న పాదయాత్ర బృందం

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయం పాదయాత్ర బృందం సభ్యులతో సందడిగా మారింది. మహారాష్ట్రలోని షాజన్ ఔరాద్ నుంచి 300 మందితో గత నెల 26న బయలుదేరి సోమవారం రాత్రి కేతకి ఆలయానికి చేరుకున్నారు. మంగళవారం ఉదయం ఆలయ ఆవరణలోని అమృత గుండంలో పవిత్ర పుణ్య స్నానాలు ఆచరించి, గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తి శ్రద్ధలతో భజన కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రతీ ఒక్కరు సన్మార్గంలో నడవాలి



పూజలు నిర్వహిస్తున్న సంగ్రాం మహారాజ్

నారాయణఖేడ్: సమాజంలో ప్రతీ ఒక్కరు సన్మార్గంలో నడవాలని అఖిలభారత సాధు సంతుల రాష్ట్రప్రతినిధి సంగ్రాం మహారాజ్, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు రమేశ్‌చౌహాన్ అన్నారు. ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు మహారాష్ట్రలోని జలగాల జిల్లా జస్మూరు తాలుక గోద్రి తండాలో నిర్వహించనున్న మహా కుంభమేళకు సంబంధించి మొదటి విశిష్ట సమావేశాన్ని నారాయణఖేడ్ మండలం కాంజీపూర్ తండాలో నిర్వహించారు. కుంభ మేళ కార్యాక్రమానికి ఖేడ్ ప్రాంతం నుంచి గిరిజనులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయోజక్ రాజ్‌కుమార్, విభాగ్ సంయోజక్ రాజునాయక్, రవినాయక్, పండరి నాయక్ ఉన్నారు.

న్యాయ సహాయంపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయమూర్తి

సంగారెడ్డి టౌన్: గ్రామాల్లో న్యాయ సహాయంపై అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని దుర్గాబాయి మహిళా వికాస కేంద్రంలో ఆశ వర్కర్లకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఆశ వర్కర్లు గ్రామాల్లో అన్ని సమస్యలు తెలుసుకుంటారని, భూమికి సంబంధించిన సమస్యలు, భూతగాదాలు, వివిధ రకాల మహిళా సమస్యలకు సంబంధించి న్యాయపరమైన సేవలు పొందాలని సూచించారు. ఎలాంటి న్యాయ సహాయం కావాలన్నా కార్యాలయంలో సంప్రదించాలన్నారు. దుర్గాబాయి మహిళా వికాస కేంద్రం మేనేజర్ సుగుణ పాల్గొన్నారు.

టీఎన్‌జీఓ ట్రెజరీ అసోసియేషన్ ఎన్నిక

సంగారెడ్డి మున్సిపాలిటీ: టీఎన్‌జీఓ ఉమ్మడి మెదక్ జిల్లా ట్రెజరీస్ అసోసియేషన్ ఎన్నికలు మంగళవారం జిల్లా కేంద్రం సంగారెడ్డిలో జరిగాయి. ఈ ఎన్నికలకు టీఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడు సుశీల్ బాబు, ఎన్నికల అధికారి నిర్మల రాజకుమారి హాజరయ్యారు. ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులుగా టి.సంపత్‌కుమార్, ఆర్.సత్యప్రకాష్, అసోసియేట్ అధ్యక్షుడిగా నిఖిల్, ట్రెజరర్‌గా కాంతయ్య, వైస్ ప్రెసిడెంట్లుగా రఫిక్, ఎం.శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

ఖగోళ పరిశోధనలో ఐఐటీహెచ్ కీలక అడుగులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఖగోళ వాతావరణంపై హైదరాబాద్ ఐఐటీ ఫిజిక్స్ విభాగం భాగస్వామిగా ఉన్నది ఇండియన్ పల్సర్ టైమింగ్ అర్రే అనే పరిశోధన సంస్థ చేపట్టిన పరిశోధన వ్యాసం అస్ట్రోనోమికల్ సొసైటీ ఆఫ్ ఆస్ట్రేలియా జర్నల్‌లో ప్రచురితమైందని హైదరాబాద్ ఐఐటీ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఐఐటీహెచ్ ప్రొఫెసర్ శాంతనుదేశాయ్, పీహెచ్‌డీ విద్యార్థి అమన్ శ్రీవాత్సవ, బీటెక్ విద్యార్థి దివ్యనాష్ కర్బాండ, ఐఐటీహెచ్ పూర్వ విద్యార్థి రాఘవలు చేస్తున్న పరిశోధనలకు సంబంధించిన డాటాతో కూడిన వ్యాసం ఈ జర్నల్‌లో ప్రచురితమైంది. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ తమ విద్యా సంస్థ చేస్తున్న పరిశోధనలు సైన్స్, ఇంజినీరింగ్ వృత్తుల్లో విద్యార్థులు చేరేందుకు ప్రేరేపిస్తాయని అన్నారు. తమ పరిశోధనలు ఆధునిక ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ విధానం అభివృద్ధి ఎంతో ఉపయోగపడుతాయని ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ శంతనుదేశాయ్ పేర్కొన్నారు.

ఆస్పత్రి నిర్మాణాన్ని పూర్తి చేయాలి



మట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

- జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు

కోహీర్(జహీరాబాద్): కోహీర్ ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు కాంట్రాక్టర్, సంబంధిత ఇంజినీరింగ్ విభాగం అధికారులకు ఆదేశించారు. మంగళవారం మండల నాయకులతో కలిసి రూ.11 కోట్లతో చేపట్టిన ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల నాణ్యత ప్రమాణాల విషయంలో ఎలాంటి అశ్రద్ధ చేయరాదని సూచించారు. కోహీర్ అస్పత్రి సేవలు అందుబాటులోకి వస్తే దిగ్వాల్, బిలాల్‌పూర్ పీహెచ్‌సీలపై భారం తగ్గి మండల ప్రజలతో పాటు కర్ణాటక సరిహద్దు ప్రాంతాల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు యాదవ్, ఆత్మ కమిటీ చైర్మన్ పెంటారెడ్డి, నాయకులు సయ్యద్ మోహియోద్దీన్, ఎస్కే జావెద్, సవుద్, కలీం, సంపత్‌కుమార్, జలీల్, యూసూఫ్ పటేల్, అస్లమ్, సందీప్‌కుమార్, అన్వార్, ఫిరోజ్, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పరీక్షలు

పటాన్‌చెరు టౌన్: టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమ అధికారి(సీడీపీఓ, అడిషనల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్, మేనేజర్ ఆఫ్ వేర్ హౌస్) పోస్టులకు నియామక పరీక్షలు మంగళవారం పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గీతం విశ్వవిద్యాలయంలో జరిగాయి. పరీక్షరాసే అభ్యర్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. పరీక్ష రెండు సెషన్స్‌లో జరిగాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, అదేవిధంగా మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు పరీక్ష సాగింది. ఉదయం 210 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 132 మంది హాజరయ్యారు. మిగతా 78 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా మధ్యాహ్నం రెండో సెషన్‌లో సాగిన పరీక్షలో 210 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 134 మంది పరీక్షకు హాజరు కాగా 76 మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు.

రావి ఆకుపై సావిత్రీబాయి పూలే చిత్రం



నారాయణఖేడ్: సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకొని మండలంలోని అనంతసాగర్‌కు చెందిన ప్రముఖ పత్ర చిత్రకారుడు గుండు శివకుమార్ రావి ఆకుపై సావిత్రీబాయిపూలే చిత్రాన్ని వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సమాజంలోని అసమానతలమీద సావిత్రీబాయి అలుపెరుగని పోరాటాలు చేశారన్నారు. మహిళల హక్కుల సాధన కోసం విశేష కృషి చేశారని గుర్తు చేశారు.

ఎర్రకోటపై గులాబీ జెండా ఎగరేస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఢిల్లీలోని ఎర్రకోటపై గులాబీ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం రామచంద్రాపురం పట్టణంలో కార్పొరేటర్ పుష్పనగేశ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని సాధించుకొని రెండుసార్లు అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాల వారు ఆదర్శంగా తీసుకుంటున్నారని తెలిపారు. దేశాన్ని పరిపాలించే సత్తా కేసీఆర్‌కు ఉందని, దేశ ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అందించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఢిల్లీలో సైతం పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేసీఆర్ నాయకత్వాన్ని హర్యానా, పంజాబ్ పాలకులు సైతం బలపర్చారని తెలిపారు. భగవంతుని ఆశీస్సులతో దేశంలో అధికారాన్ని చేపడతామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేస్తామని ఇప్పటికే ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అనేక మంది మేధావులు, వివిధ పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలపై ప్రజలకు నమ్మకం లేదన్నారు. వారు పాలిస్తున్న రాష్ట్రాల్లోని మారుమూల ప్రాంతాల్లో విద్యుత్, తాగునీటి సదుపాయాలు కూడా లేవన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజయ్య యాదవ్, బూరుగడ్డ నగేశ్, సామిల్, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



కర్నాల్‌పల్లిలో ఆర్టీసీ సేవలను వివరిస్తున్న డీఎం శ్రీనివాస్‌రావు

చేగుంట(తూప్రాన్): ఆర్టీసీ అదిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ ఆర్టీసీ డిపో డీఎం శ్రీనివాస్‌రావు అన్నారు. మండలంలోని కర్నాల్‌పల్లి గ్రామంలో మంగళవారం కళాప్రదర్శన నిర్వహించారు. మాట్లాడుతూ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ ఆదేశాల మేరకు ఆర్టీసీ అందిస్తున్న సేవలు, కార్గో రవాణాపై ప్రజలకు తెలియజేసేందుకు అవగాహన కల్పించామన్నారు. అన్ని రూట్లలో ప్రజలు ఆర్టీసీని ఆదరించాలని, ప్రజా అవసరార్థం మరిన్ని బస్సులు నడిపేందుకు కృషి చేస్తామన్నారు. ఎస్‌టీఐ కనకలక్ష్మి, సేఫ్టీ డ్రైవర్ కెఎం రెడ్డి, కార్గో మార్కెటింగ్ ఇన్‌చార్జి సందీప్ ఉన్నారు.

ఆటోనగర్‌కు స్థలం కేటాయింపు హర్షణీయం



మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న మెకానిక్ అసోసియేషన్ సభ్యులు

జహీరాబాద్: జహీరాబాద్ పట్టణ మెకానిక్ అసోసియేషన్ సభ్యుల విన్నపం మేరకు బూర్దిపాడ్ గ్రామంలో ఆటోనగర్ కోసం భూమి కేటాయించడం పట్ల సంఘం నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. మంగళవారం ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావును క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. 83 సర్వే నంబర్‌లో నాలుగు ఎకరాల భూమిని కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే కె.మాణిక్‌రావులను కలిసి కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. టీఆర్ఎస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. మెకానిక్ అసోసియేషన్ సభ్యులు అన్నారు.

'కంటి వెలుగు'కు 69 బృందాలు

- కలెక్టర్ డాక్టర్ శరత్



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు

సంగారెడ్డి టౌన్: జిల్లాలో ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి 69 బృందాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ డాక్టర్ శరత్ తెలిపారు. మంగళవారం కంటివెలుగు కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 17,11,685 మందికి స్క్రీనింగ్ చేయనున్నట్లు తెలిపారు. ఏఎన్ఎంలు, ఆశల ద్వారా ఇంటింటికీ కంటివెలుగు కార్యక్రమంపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమ విజయవంతానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, ఆయా బృందాలు అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, జిల్లాలోని జీహెచ్ఎంసీ ఏరియాను కవర్ చేస్తాయని మంత్రికి వివరించారు. ఒక్కో టీంలో ఒక మెడికల్ ఆఫీసర్, పారామెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్, డాటా ఎంట్రీ ఆపరేటర్, ఇద్దరు ఏఎన్ఎంలు, ముగ్గురు ఆశలు ఉండేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 854 క్యాంపులను ఏర్పాటు చేసేందుకు వేదికలను గుర్తించామని తెలిపారు. 69 మంది పారామెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్లు, 69 డాటా ఎంట్రీ ఆపరేటర్లను ఆరు నెలలకాల పరిమితితో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన నియమించినట్లు చెప్పారు. పీహెచ్‌సీలు, పల్లె దవాఖానాల్లో కొత్తగా నియామకమైన మెడికల్ ఆఫీసర్లను క్యాంప్ మెడికల్ ఆఫీసర్లుగా కంటి వెలుగు టీంలలో అలాట్ చేస్తామని తెలిపారు. ఈనెల 12లోగా మంత్రి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడానికి, కౌన్సిల్, మండల పరిషత్ సమావేశాలు పూర్తయ్యేలా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలలో వార్డుల వారీగా ప్రజాప్రతినిధులకు ముందస్తుగా కంటి వెలుగు క్యాంపునకు సంబంధించి తేదీలను తెలియజేస్తామన్నారు. అందరి భాగస్వామ్యంతో కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి అదనపు కలెక్టర్లు రాజర్షిషా, వీరారెడ్డి, అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, మున్సిపల్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, ఆయా జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రఘు

రాయికోడ్(అందోల్): సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జహీరాబాద్ డీఎస్పీ రఘు అన్నారు. మంగళవారం రాయికోడ్ పోలీస్ స్టేషన్‌ను సీఐ వెంకటేష్‌తో కలిసి సందర్శించారు. నమోదైన కేసుల వివరాలు, కేసుల దర్యాప్తు, పురోగతి తదితర వివరాలను ఎస్ఐ ఏడుకొండలును అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు పోలీస్ శాఖ కృషి చేస్తోందన్నారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్‌ను విధిగా పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇల్లు ఇదే..

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని వల్లంపట్ల గ్రామంలో ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యాదగిరి కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లతో పాటు ఇంట్లో ఉన్న వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు రూ.5లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

చుంచనకోట దుర్గమ్మ గుడిలో చోరీ



చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని చుంచనకోట దుర్గమ్మ గుడిలో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. మంగళవారం ఉదయం ఆలయాన్ని శుభ్రం చేసేందుకు వచ్చిన పొన్నబోయిన సిద్దులు గుడి తాళం పగులగొట్టి ఉండడాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించాడు. ఈ చోరీలో 13 గ్రాముల బంగారు ఆభరణాలు, 36 తులాల వెండి ఆభరణాలు, రూ.5వేల నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య



శ్రీకాంత్(ఫైల్)

టేక్మాల్(మెదక్): జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన టేక్మాల్ మండలం అచ్చన్నపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుండ్ల శ్రీకాంత్(27) ఆర్మూర్‌లో కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాది కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భార్య మహేశ్వరి తల్లిగారింటికి వెళ్లింది. అప్పటి నుంచి ఒక్కడే ఉంటున్న శ్రీకాంత్ జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహ త్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం గమనించిన ఇరుగుపొరుగు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగం తెలిపారు.

లక్ష్యం 50 వేల ఎకరాలు

- 'ఆయిల్‌పామ్'పై ప్రత్యేక దృష్టి
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
- సాగు ప్రోత్సహించేందుకు రాయితీలు

సాక్షి, సిద్దిపేట: రైతులకు దీర్ఘకాలిక ఆదాయం అందించే ఆయిల్‌పామ్ సాగుపై ప్రభుత్వం దృష్టి సారించింది. రైతులను సాగువైపు మళ్లించేందుకు అవగాహన కల్పిస్తోంది. దీనిలో భాగంగా జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును పెంచేలా రైతులను ప్రోత్సహించి, ఐదేళ్లలో 50 వేల ఎకరాల్లో సాగు లక్ష్యంగా జిల్లా యంత్రాంగం కార్యాచరణ సిద్ధం చేసింది. 35 ఏళ్ల పాటు ఆయిల్‌పామ్‌తో లాభాలు ఆర్జించవచ్చని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

పుష్కలంగా నీరు

- సిద్దిపేట జిల్లాలో 6,766 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోంది. ఇప్పటికే నంగనూరు మండలం నర్మెట్టలో 60 ఎకరాల్లో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు.
- ఆయిల్‌పామ్ సాగుకు నీరు, తేమ ఎక్కువగా ఉండాలి. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రంగనాయక సాగర్, కొండపోచమ్మ, మల్లన్నసాగర్, అనంతగిరి రిజర్వాయర్లు నిండుగా ఉండడంతో సాగుకు నీటి సమస్య తప్పింది.
- రైతులను సాగువైపు మళ్లించేందుకు గతేడాది నుంచి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. అశ్వరావుపేటకు తీసుకెళ్లి ఆయిల్‌పామ్ సాగు విధానాన్ని చూపించారు.



మర్కూక్‌లో సాగవుతున్న ఆయిల్‌పామ్

- అంతేకాకుండా సాగు చేసే రైతులకు ప్రభుత్వం డ్రిప్, రాయితీ అందిస్తుండడంతో రైతులు సైతం ఆసక్తి చూపుతున్నారు.
- మొదటి ఏడాది ఎకరాకు సుమారు 5 టన్నులకు పైగా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం రూ.15 వేలకు పైగా ధర పలుకుతోంది.
- తొలి ఏడాది ఎకరాకు సుమారు రూ. 75 వేల నుంచి రూ. లక్ష వరకు ఆదాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు.
- నాలుగు నుంచి పదేళ్ల వరకు ఏటా రెండు టన్నుల చొప్పున దిగుబడి పెరుగుతూ వస్తోంది.
- పదేళ్ల నుంచి 35 ఏళ్ల వరకు సుమారు 12 నుంచి 15 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.
- బాగా పెరిగిన ఆయిల్‌పామ్ తోటలో ఎకరానికి సుమారు ఏడాదికి 15 టన్నుల పంట తీయొచ్చు.
- కనీసం రూ. 15 వేల చొప్పున విక్రయించినా రూ. 2,25,000 వస్తుంది. రూ. 45 వేల వరకు ఖర్చులు పోయినా రూ.1.80 లక్షలు గిట్టుబాటు అవుతుంది.
- మరోవైపు అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం ఆర్జించే అవకాశం ఉంది. అంతా కలిపి ఎకరాకు రూ.3 లక్షల వరకు సంపాదించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

మంత్రి చొరవతో..

సాగు పెంచేందుకు కృషి



ఐదేళ్లలో 50 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవ, వ్యవసాయ, ఉద్యానవన సిబ్బంది సహకారంతో సాగు విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తున్నాం. ఈ పంట సాగుతో రైతులు దీర్ఘకాలిక లాభాలు పొందవచ్చు. – శివప్రసాద్, డిప్యూటీ డైరెక్టర్, వ్యవసాయ శాఖ

- జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో రైతులు సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు.
- వారంలో రెండు రోజులు జిల్లాలోని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో మంత్రి సాగుపై సమీక్ష, టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు.
- ప్రతీ సమావేశంలో ఆయిల్‌పామ్ సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులకు సూచిస్తున్నారు.
- దీంతో జిల్లాలో క్రమంగా ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరుగుతోంది. నెల రోజుల్లో 1,050 ఎకరాల్లో సాగు చేశారు.
- 2021–22 వరకు 655 మంది రైతులు 2,770 ఎకరాల్లో సాగు చేశారు. 2022 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 1,051 మంది రైతులు 3,996 ఎకరాల్లో సాగుచేస్తున్నారు.

జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్

లింక్ క్లిక్ చేసి పలుదఫాలుగా రూ.3,49,073 ట్రాన్స్‌ఫర్

పటాన్‌చెరు టౌన్: జాబ్ ఆఫర్ పేరుతో ఒకరికి వాట్సాప్ మెసేజ్ వచ్చింది. తన వివరాలు నమోదు చేసి..నగదు పంపాడు. ఇలా 3,49,073 రూపాయలు సైబర్ నేరగాడికి పంపి మోసపోయాడు. పోలీసుల కథనం ప్రకారం ...పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు చెందిన నరేష్ ప్రైవేట్ ఉద్యోగి. గత ఏడాది నవంబర్ 21వ తేదీన నరేష్‌కు జాబ్ ఆఫర్ పేరిట వాట్సాప్‌లో ఓ మెసేజ్ వచ్చింది. లింక్ క్లిక్ చేసి వివరాలు నమోదు చేశాడు. ముందుగా రూ.1000 చెల్లించాడు. ఈ మొత్తానికి కమీషన్ ఇచ్చారు. పెద్ద మొత్తంలో మనీ ట్రాన్స్‌ఫర్ చేస్తే రెట్టింపు డబ్బుతోపాటు కమీషన్ ఇస్తామని సైబర్ నేరగాడు నమ్మబలికారు. దీంతో బాధితుడు ఫలుదఫాలుగా రూ.3,49,073 ట్రాన్స్‌ఫర్ చేయగా, రూ.6,44,398 వస్తుందని నమ్మించారు. అయితే డబ్బు తన ఖాతాలో జమ చేయాలంటూ ఫోన్ చేయగా, నరేష్ నంబరు బ్లాక్‌లో పెట్టారు. దీంతో తన మోసపోయినట్లు గుర్తించి మొదటగా సైబర్‌క్రైంలో ఫిర్యాదు చేశాడు. మంగళవారం పటాన్‌చెరు ఠాణాలో కూడా ఫిర్యాదు చేశాడు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 23 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 23 మంది పట్టుబడ్డారు. మంగళవారం కోర్టులో హాజరు పర్చగా జరిమానా విధించారు.

పాదచారుడిని ఢీ కొట్టిన వాహనం

- తీవ్రగాయాలు కావడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు
- మార్గమధ్యలో మృతి చెందినట్లు వైద్యుల వెల్లడి

పటాన్‌చెరు టౌన్: రోడ్డు దాటుతున్న పాదచారుడిని బొలెరో ట్రాలీ వాహనం ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు మార్గ మధ్యలోనే మృతిచెందినట్లు వెల్లడించారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రసాద్‌రావు కథనం ప్రకారం...వనపర్తి జిల్లా ఖిలాఘనపూర్ మండలం ఉప్పరిపల్లి గ్రామానికి చెందిన దత్తయ్య(44) బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరులోని భగత్‌గల్లిలో నివాసం ఉంటున్నాడు. పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 6.30 గంటలకు డ్యూటీకి వెళ్తుండగా నవపాన్ సమీపంలో రోడ్డు దాటుతుండగా బొలెరో ట్రాలీ ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. దత్తయ్యను చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు మార్గమధ్యలోనే మృతిచెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



దత్తయ్య (ఫైల్)

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కంది(సంగారెడ్డి): ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటనమండల పరిధిలోని కాశిపూర్‌లో చోటుచేసుకుంది. ఇంద్రకరణ్ ఎస్ఐ రాజేశ్‌నాయక్ కథనం ప్రకారం కాశిపూర్‌కు చెందిన షాపురం శోభన్ గౌడ్(39) రెండేళ్ల నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నాడు. కడుపు నొప్పి బాధ భరించలేక మద్యానికి అలవాటుపడ్డాడు. దీంతో శోభన్ గౌడ్ మానసిక స్థితి సరిగా లేదు. ఈక్రమంలో సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేనిసమయంలో పైకప్పు రేకులకు అమర్చిన వైపునకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య షాపురం జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



శోభన్ గౌడ్(ఫైల్)

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

కోహెడరూరల్(హుస్నాబాద్): వేర్వేరు చోట్ల విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృత్యువాత పడ్డాయి. కోహెడమండలంలోని తంగళ్లపల్లి మోయతుమ్మెద వాగులో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో పాడిగేదె మృతి చెందింది. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తొంటి రమేశ్ రోజూలాగే తన గేదెను వాగు సమీపంలో మేపుతున్నాడు. సోమవారం ఉదయం మెయతుమ్మెదవాగు దిగి నీరు తాగుతుండగా విద్యుత్ షాక్‌తో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో సుమారు 80వేల నష్టం వాటిల్లిందని రైతు రమేశ్ తీవ్రంగా రోదించాడు. బాధిత రైతుకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూస్తానని సర్పంచ్ పాము నాగేశ్వరి శ్రీకాంత్ హామీ ఇచ్చారు.

తోర్నాలలో...

సిద్దిపేటరూరల్: కరెంటు షాక్‌కు గురై పాడి గేదె మృతి చెందిన సంఘటన సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని తోర్నాల గ్రామంలో చోటు చేసుకుంది. రైతు సందిరెడ్డి కిష్టారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. తన వ్యవసాయ పొలం వద్ద రోజూలాగే మంగళవారం కూడా గేదెకు నీళ్లు పెడదామని పొలం దగ్గరకు తీసుకెళ్లాడు. పొలంలో నీళ్లు తాగుతుండగా పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ అర్తింగ్ వైరు తగిలి అక్కడికక్కడే చనిపోయింది. ఇటీవల గేదెను రూ.80వేలతో కొనుగోలు చేశానని, ఇప్పుడు మృతి చెందడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.



గేదె వద్ద రోదిస్తున్న బాధిత రైతు

అదృశ్యమైన వ్యక్తి.. శవమై తేలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): అదృశ్యమైన ఓ యువకుడు చెరువులో శవమై తేలిన సంఘటన మంగళవారం మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. సదాశివపేట సీఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..వెంకటాపూర్ గ్రామానికి చెందిన మన్నే లక్ష్మణ్(24)ఓ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడు. గత నెల 31న తన తండ్రి కిష్టయ్యతో కలిసి భోజనం చేసి రాత్రి 9గంటల సమయంలో ఇద్దరు కలిసి పడుకున్నారు. అదేరోజు రాత్రి 12గంటల సమయంలో తండ్రి నిద్రలేచి చూసేసరికి కుమారుడు ఇంట్లో కనబడలేదు. దీంతో బంధువులు, చుట్టుపక్కల వారి వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం గ్రామ శివారులోని మొగుల చెరువులో మృతదేహం పైకి తేలింది. మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

చేగుంట(తూప్రాన్): అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన మాసాయిపేట మండలం బొమ్మారంలో మంగళవారం చోటు చేసుకుంది. చేగుంట ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం చేగుంట మండలం ఇబ్రహీంపూర్‌కు చెందిన కుమ్మరి సత్తవ్వ(60) కూతురు రేణుక వివాహం బొమ్మారం గ్రామానికి చెందిన దత్తుతో జరిగింది. సత్తవ్వ భర్త మూడేళ్ల క్రితం మృతి చెందగా, కూతురు రేణుక వద్ద ఉంటూ అప్పుడప్పుడు ఇబ్రహీంపూర్‌కు వచ్చి వెళుతుండేది. ఏం జరిగిందో గాని మంగళవారం ఉదయం బొమ్మారంలోని కూతురు ఇంట్లో సత్తమ్మ మృతదేహం కిటికీ వేలాడుతూ కనిపించింది. అమ్మ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని రేణుక తన తమ్ముడికి ఫోన్ చేసింది.విషయం తెలుసుకున్న సత్తవ్వ కుమారుడు స్వామి సంఘటనస్థలికి చేరుకున్నారు. తన తల్లిని అక్క రేణుక, బావ దత్తులే హత్య చేశారని ఆరోపిస్తూ గొడవకు దిగాడు. స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కారు అదుపుతప్పిన ఘటనలో ఒకరి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున రామచంద్రాపురం పట్టణంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నగరంలోని అంబర్‌పేటకు చెందిన ఎండీ సాజిత్(28) డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కాగా మంగళవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో అతని స్నేహితులు సుల్తాన్, ఇంతియాజ్‌తో కలిసి లింగంపల్లి వైపు నుంచి పటాన్‌చెరులోని ఇస్నాపూర్‌కు తినేందుకు కారులో బయలుదేరారు. అశోక్‌నగర్ సమీపంలో వేగంగా వెళ్తున్న కారును అదుపు చేయలేక డివైడర్‌ను ఢీ కొట్టారు. అదే వేగంతో ఎడమ వైపు ఆగి ఉన్న ప్రైవేట్ బస్సును ఢీ కొట్టారు. తీవ్ర గాయాలైన ముగ్గురిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే సాజిత్ మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి గురైన కారు

బెయిల్‌పై వచ్చి..తాగుడుకు బానిసై

దుబ్బాక: భార్యను చంపిన కేసులో బెయిల్‌పై జైలు నుంచి వచ్చిన భర్త జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. రాయపోల్ ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డేపల్లి గ్రామానికి చెందిన చెట్టే సత్తయ్య (30) వ్యవసాయం చేసుకుంటూ.. జీవనం కొనసాగిస్తూ ఉండేవాడు. గతేడాది కుటుంబ సమస్యలతో భార్యను గొడ్డలితో నరికి చంపిన కేసులో జైలు పాలయ్యాడు. సత్తయ్య ఇద్దరు పిల్లలు తన అక్క దగ్గరే ఉంటున్నారు. ఇటీవల బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చిన సత్తయ్య తల్లి పోచమ్మతో కలిసి వడ్డేపల్లిలోనే ఉంటున్నాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తల్లి పోచవ్వ అహ్మదీపూర్‌లో ఉన్న తన కుమార్తె ఇంటికి నాలుగు రోజుల క్రితం వెళ్లింది. ఆమె సోమవారం రాత్రి తిరిగి ఇంటికి వచ్చే వరకు సత్తయ్య ఇంట్లో ఉరేసుకొని కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు 3 రోజుల క్రితం ఉరేసుకుని ఉంటాడని తెలిపారు. మృతదేహాన్ని పరీక్షల నిమిత్తం గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. తల్లి పోచవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్యాస్ కనెక్షన్ల పేరిట మోసం

మద్దూరు(హుస్నాబాద్): గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల్లో తిరుగుతూ వృద్ధులను లక్ష్యంగా చేసుకొని వారిని మాటల్లో పెట్టి నగదు అపహరించారు. ఈ సంఘటన మండలంలోని మర్మాముల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ఓ గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి గ్రామానికి చెందిన శీలం విఠలయ్య ఇంటికి వచ్చి మీకు సబ్సిడీపై గ్యాస్ కనెక్షన్ మంజూరైందని రూ.3,800 చెల్లిస్తే గ్యాస్ సిలిండర్, స్టవ్ ఇస్తామని నమ్మించాడు. మీ కుమారుడు నాకు తెలుసునని ఆయనతో ఫోన్‌లో మాట్లాడినట్లు నమ్మించాడు. ఆ వ్యక్తి మాటలు నమ్మిన విఠలయ్య అతనికి రూ.3800 నగదు ఇచ్చాడు. గ్యాస్ బండి తీసుకొస్తానని చెప్పిన వ్యక్తి ఎంతకీ రాకపోవడంతో తాను మోసపోయానని గుర్తించాడు. ఐదు రోజుల క్రితం లద్నూరు గ్రామానికి చెందిన భోగి శ్రీరాములును సైతం గుర్తు తెలియని వ్యక్తి ఇదే రీతిలో గ్యాస్ కనెక్షన్ పేరుతో మాయామాటలు చెప్పి అతని నుంచి రూ.11,200 తీసుకొని పరారైనట్లు బాధితుడు వాపోయాడు. ఈ విషయంపై ఎస్ఐ నారాయణను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని కేవలం మర్మాముల గ్రామంలో జరిగిన సంఘటన తమ దృష్టికి వచ్చిందన్నారు.

అదుపు తప్పిన మహారాష్ట్ర బస్సు

- బైక్‌ను తప్పించబోయి రోడ్డు కిందకు...
- పలువురికి స్వల్ప గాయాలు

పెద్దశంకరంపేట(మెదక్): హైదరాబాద్ నుంచి డెగ్లూర్ వెళుతున్న మహారాష్ట్రకు చెందిన బస్సు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. ఈ ఘటన మంగళవారం సాయంత్రం పెద్దశంకరంపేట మండలం కమలాపూర్ వద్ద 161వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. సర్వీసు రోడ్డు మీదుగా వెళుతున్న మహారాష్ట్ర బస్సు ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కాగా, ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ బాలరాజు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.



రోడ్డు కిందకు దూసుకెళ్లిన మహారాష్ట్ర బస్సు

ప్రేమపెళ్లి..రెండురోజులకే వద్దన్నాడు

- మనస్తాపంతో యువతి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి

మనోహరాబాద్(తూప్రాన్): ప్రేమించాడు..పెళ్లి చేసుకున్నాడు..రెండురోజులకే ఇద్దరి కులాలు వేరంటూ వదిలేశాడు. తనకు న్యాయం చేయాలంటూ ఆ యువతి వేడుకున్నా కనికరించలేదు. దీంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగింది. నెల రోజులుగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. దీంతో మృతురాలు కుటుంబీకులు, బంధువులు మృతదేహాన్ని ఆ యువకుడి ఇంటి వద్ద ఉంచి ఆందోళనకు దిగారు. మండలపరిధిలోని ధర్మరాజ్‌పల్లి గ్రామానికి చెందిన యశ్వంత్ రెడ్డి, అదే గ్రామానికి చెందిన బాషబోయిన తేజశ్రీ (18)లు మూడు సంవత్సరాలుగా ప్రేమించుకున్నారు. గతేడాది అక్టోబర్ 15న పెళ్లి చేసుకున్నారు. అక్టోబర్ 19న పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు కాపురం చేసుకుంటామని ఒప్పుకున్నారు. అయితే ఇద్దరి కులాలు వేరుకావడంతో విభేదాలు వచ్చాయి. యువతికి అండగా కులపెద్దలు ఉండి పెద్ద ఎత్తున నిరసనలు తెలిపినా ఎలాంటి న్యాయం జరగలేదు. దీంతో ఆ యువతి పురుగుల మందు తాగింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. నెల రోజులుగా చికిత్స పొందుతున్న తేజశ్రీ మంగళవారం వేకువజామున మృతి చెందింది. తేజశ్రీ మృతదేహాన్ని యశ్వంత్‌రెడ్డి ఇంటి వద్ద ఉంచి ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ శ్రీధర్, ఎస్ఐ సందీప్‌రెడ్డిలు సంఘటన స్థలానికి వచ్చి ఆందోళనకారులకు నచ్చజెప్పారు. పోలీసులు చివరికి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించి అంత్యక్రియలు చేశారు.



తేజశ్రీ(ఫైల్)

ఔటర్‌పై అత్యవసర వైద్యసేవలు

గతేడాది వెయ్యి మందికిపైగా చికిత్స

- ఔటర్‌రింగ్‌రోడ్డుపై ప్రమాద బాధితులకు క్షణాల్లో వైద్యసదుపాయం
- ఇంటర్‌ఛేంజ్‌ల వద్ద ట్రామాకేర్ సెంటర్లు
- టెలీమెడిసిన్ ద్వారా వైద్య నిపుణుల పర్యవేక్షణ

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ చుట్టూ 158 కిలోమీటర్ల మేర ఉన్న ఔటర్ రింగురోడ్డుపై ప్రమాదాల నియంత్రణకు హెచ్ఎండీఏ అనేక చర్యలు చేపట్టింది. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) ఆధ్వర్యంలో ఔటర్‌పైన ప్రతి 8 కిలోమీటర్లకు ఒక అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్సు(ఏఎల్ఎస్) అందుబాటులో ఉండేవిధంగా ఏర్పాట్లు చేశారు. 16 ఇంటర్‌ఛేంజ్‌ల వద్ద అత్యవసర వైద్యసేవలకు ట్రామాకేర్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్లలో గతేడాది 1098 మంది రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్యసేవలు అందించారు. అపోలో, యశోద ఆస్పత్రులు ఈ అంబులెన్సులుచ ట్రామాకేర్ సెంటర్ల నిర్వహణ బాధ్యతలు చూస్తున్నాయి. గతేడాది అందజేసిన సేవలకు సంబంధించిన వివరాలను అధికారులు తాజాగా విడుదల చేశారు. పెద్దఅంబర్‌పేట్, బొంగులూరు, తుక్కుగూడ, శంషాబాద్, టీఎస్‌పీఏ ఇంటర్‌ఛేంజ్‌ల వద్ద అపోలో ఏఎల్ఎస్ అంబులెన్సులు ఉండగా, తారామతిపేట్, రావిర్యాల, పెద్దగోల్కొండ ఇంటర్‌ఛేంజ్‌ల వద్ద ట్రామాకేర్ సెంటర్‌లను ఏర్పాటు చేశారు. కోకాపేట్, పటాన్‌చెరు, దుండిగల్, శామీర్‌పేట్, ఘట్‌కేసర్‌లలో యశోద ఆసుపత్రికి చెందిన ఏఎల్ఎస్ అంబులెన్సులు 24 గంటల పాటు సేవలందజేస్తున్నాయి. కొల్లూరు, సుల్తాన్‌పూర్, మేడ్చల్‌లో ట్రామాకేర్ సెంటర్లను నిర్వహిస్తున్నారు. ప్రతి ట్రామాకేర్ సెంటర్‌లో 2 పడకలు, అవసరమైన వైద్య పరికరాలు, ఆక్సిజన్ సిలిండర్, అత్యవసర ప్రాణాధార మందులు ఉంటాయి. మరోవైపు టెలీమెడిసిన్ సదుపాయం ద్వారా వైద్యనిపుణులు సలహాలు, సూచనలు, వైద్యసేవలు అందిస్తున్నారు. పారామెడికల్ సిబ్బందితో కూడిన అంబులెన్సులను అన్ని కీలకమైన కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. ప్రమాదాలు జరిగిన వెంటనే బాధితులను సమీపంలోని ట్రామాకేర్ సెంటర్‌లకు తరలించే విధంగా ఈ అంబులెన్సులు సేవలను అందిస్తాయి. ఈ వైద్యసేవలన్నీ పూర్తిగా ఉచితం.



పటాన్‌చెరు	79	టీఎస్‌పీఏ	157
దుండిగల్	143	కోకాపేట్	91
శామీర్‌పేట్	85	తారామతిపేట్	25
ఘట్‌కేసర్	77	రావిర్యాల	3
పెద్దఅంబర్‌పేట్	127	పెద్దగోల్కొండ	9
బొంగులూరు	55	కొల్లూరు	48
తుక్కుగూడ	57	సుల్తాన్‌పూర్	39
శంషాబాద్	91	మేడ్చల్	12

(జనవరి నుంచి డిసెంబర్(2022) వరకు ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని ఆయా ఇంటర్‌ఛేంజ్‌ల వద్ద ట్రామాకేర్ సెంటర్లలో అందిన సత్వర వైద్య సేవలు ఇవి.)

క్లుప్తంగా

ధరణి ఆపరేటర్ నియామకం



కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: నూతనంగా ఏర్పాటైన నిజాంపేట మండలానికి ధరణి ఆపరేటర్‌ని నియమించినట్లు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. చల్లగిద్ద తండాకు చెందిన నవత ఆపరేటర్‌గా నియమితురాలైంది. ఆమెకు నియామక పత్రాన్ని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అలాగే నారాయణఖేడ్ స్పోర్ట్స్ క్లబ్‌కు సంబంధించి పలువురికి క్లబ్ చైర్మన్ హోదాలో సభ్యులుగా చేరిన పలువురికి రశీదులు, దామర్‌చెరువుకు చెందిన కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కల్హేర్ జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, రోషన్‌రెడ్డి, రమేశ్‌చౌహాన్ పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



ఉపకరణాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్ప తదితరులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కార్పొరేట్ పాఠశాలలు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్ప నగేశ్ అన్నారు. మంగళవారం రామచంద్రాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో తొలి మెట్టు కార్యక్రమంలో మండల స్థాయి ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు టీఎల్ఎం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి జెమిని కుమారి తదితరులు పాల్గొన్నారు.

పెద్దచెరువు నుంచి సాగునీటి విడుదల



తడ్కల్ పెద్దచెరువు నుంచి సాగు నీరు విడుదల చేస్తున్న అధికారులు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని తడ్కల్ పెద్ద చెరువు నుంచి మంగళవారం వేసవికాలం పంటలకు సాగునీరు విడుదల చేశారు. కాల్వలకు గండ్లు పూడ్చి నీరు వృథా కాకుండా తగు చర్యలు తీసుకొని నీరు విడుదలకు అనుమతి ఇచ్చినట్లు ఇరిగేషన్ ఏఈ రవి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మనోహర్, మండల రైతు సమన్వయకర్త కోట ఆంజనేయులు, ఎంపీటీసీ శ్రీకాంత్, గుర్రపు సత్యనారాయణ, జ్ఞానదేవ్, పండరి తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



చెక్కును అందిస్తున్న బ్యాంకు అధికారులు, సర్పంచ్ తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): దోమడుగు గ్రామానికి చెందిన పోచమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కాగా ప్రధాన మంత్రి సురక్ష బీమా పథకం ద్వారా రూ.12 మాత్రమే పోచమ్మ ఏపీజీవీబీలో బీమా చేసింది. పోచమ్మ రోడ్డు ప్రమాదంలో మరణించడంతో రూ.2 లక్షల బీమా మంజూరైంది. చెక్కును పోచయ్య కుటుంబ సభ్యులకు బొంతపల్లి ఏపీజీవీ బ్యాంకు మేనేజర్ రేఖ, సర్పంచ్ రాజశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు గోవర్ధన్‌రెడ్డి అందించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సూచించారు.

శరణు ఘోషతో దద్దరిల్లిన ఘన్‌పూర్

కంగ్టి(నారాయణఖేడ్): శరణం అయ్యప్ప.. స్వామియే శరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప స్వాముల శరణు ఘోషతో కంగ్టి మండలం ఘన్‌పూర్ గ్రామం దద్దరిల్లింది. సోమవారం రాత్రి గ్రామంలోని రాములు గురుస్వామి ఆధ్వర్యంలో మహాపడిపూజ నేత్రపర్వంగా నిర్వహించారు. నారాయణఖేడ్, సిర్గాపూర్, కల్హేర్, బాన్సువాడ, కామారెడ్డి, ఆర్మూర్ ప్రాంతాల నుంచి అయ్యప్ప స్వాములు భారీగా తరలివచ్చి పడిపూజలు ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి విజయ్‌పాల్‌రెడ్డి, బీజేపీ అధికార ప్రతినిధి సంగప్ప, జుక్కల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే గంగారం, బీఆర్ఎస్ యువ నాయకుడు రోషన్‌రెడ్డి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గురుస్వాములు, కన్నెస్వాములు భక్తులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలేకు ఘన నివాళి



చిట్కుల్‌లో సావిత్రీబాయి పూలేకు నివాళి అర్పిస్తున్న సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ తదితరులు

పటాన్‌చెరు టౌన్: స్త్రీ విద్య కోసం నిరంతరం కృషి చేసిన సామాజిక ఉద్యమకారిణి సావిత్రీబాయి పూలే చైతన్య మూర్తి అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, చిట్కుల్ గ్రామ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో సావిత్రీబాయి పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మురళీ, వెంకటేశ్, రాజుకుమార్, శ్రీను, విష్ణు, అనిల్, వెంకటేశ్, మహ్మద్, ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో..
స్త్రీ విద్యాభివృద్ధి, హక్కుల కోసం కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రీబాయి పూలే అని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు మండల పరిధి బచ్చుగూడెంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ కౌన్సిలర్ ఎడ్ల రమేశ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవేందర్ గౌడ్, జిల్లా మహిళ మోర్చా ఉపాధ్యక్షురాలు గడ్డ పుణ్యవతి, మండల ప్రధాన కార్యదర్శి కావలి వీరేశం, బీజేపీ నాయకుడు అల్లం రాజిరెడ్డి, ఎస్ఆర్‌కె యువసేన పాల్గొన్నారు.

హత్నూర(సంగారెడ్డి): సావిత్రీబాయి పూలే జయంతిని మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన హత్నూర గురుకుల కళాశాల పాఠశాలలో, దౌల్తాబాద్ తెలంగాణ తల్లి చౌరస్తాలో ఏర్పాటుచేసిన ఆమె చిత్రపటానికి దళిత సంఘాల ఆధ్వర్యంలో పూలమాలు వేసి నివాళులర్పించారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం సావిత్రీబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ అశోక్, లెక్చరర్లు సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అర్జున్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోహీర్(జహీరాబాద్): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేశ్, జిల్లా సమతా సైనిక్ దళ్ అధ్యక్షుడు బాలరాజు, డివిజన్ అధ్యక్షుడు రవికుమార్, ఉపాధ్యక్షుడు తుల్జారామ్, నాయకులు నర్సింహులు, శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట(అందోల్): స్త్రీ విద్య కోసం చారిత్రక పోరాటం చేసిన ధీశాలి సావిత్రీబాయి పూలే అని పలువురు నాయకులు అన్నారు. మంగళవారం జోగిపేటలో సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ డీబీ నాగభూషణం, బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు చాపల వెంకటేశం, విశ్రాంత ఎంఈఓ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్: ఆధునిక భారత తొలి ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలేకు పలు సంఘాల నేతలు ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం రంజోల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు అబ్రహం మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయురాలిగా, సంఘ సంస్కర్తగా, అభ్యుదయవాదిగా దేశానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సూర్యకాంత్, బబ్లూ, బన్ని, చంటి పాల్గొన్నారు. సమతా సైనిక్‌దళ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గం కో–ఆర్డినేటర్ రాములు, సంస్థ సభ్యులు నివాళులర్పించారు.



బచ్చుగూడెంలో నివాళులర్పిస్తున్న ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్



ఝరాసంగంలో..



సదాశివపేట పట్టణంలో..

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలో సావిత్రీబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మునిపల్లి(అందోల్): సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం మండలంలోని తాటిపల్లి యునైటెడ్ స్కూల్‌లో కరస్పాండెంట్ మల్లేశం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సదాశివపేట(సంగారెడ్డి): చదువుకు దూరం అవుతున్న మహిళకు చదువు చెప్పిన గొప్ప మాతృమూర్తి సావిత్రీ బాయి పూలేనని ఎస్ఐ నాగలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక భవిత జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలేనని ఆమే అన్నారు. సావిత్రిబాయి గురించి ప్రతి మహిళ గుర్తించుకుని ఆమే చేసిన సేవలను గుర్తు చేసుకోవాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రజనీకాంత్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం మహిళలకు 30 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. 2014 నుంచి 2022 వరకు దేశంలో మహిళలపై జరిగిన అరాచకాలు అత్యాచారాలు గృహనిర్బంధం మొత్తం కలిపి 31 వేల కేసులు నమోదైనాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని ఆయా గ్రామాల్లో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను మంగళవారం యువకులు, ఆయా పాఠశాలల్లో విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. కానుకుంట, జిన్నారం, బొల్లారం మున్సిపల్ పరిధిలో యువకులు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పూలేకు నివాళులర్పించారు.

అంకితభావంతో పనిచేసిన వారికి గుర్తింపు



ఏడీఏను సన్మానిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: అంకిత భావంతో పనిచేసిన అధికారులకు మంచి గుర్తింపు ఉంటుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడి, జేడీ నర్సింహరావు అన్నారు. నారాయణఖేడ్ డివిజన్ వ్యవసాయ అధికారి కరుణాకర్ రెడ్డి ఇటీవల స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా జూకల్ శివారు రైతువేదికలో ప్రత్యేక సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణకర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అధికారులు అందించిన సేవలు ప్రజా ప్రతినిధులు, ప్రజలు గుర్తించుకుంటారన్నారు. నారాయణఖేడ్‌కు చెందిన ఫర్టిలైజర్ యజమానులు ఖేడ్ చౌరస్తా నుంచి జూకల్ శివారు రైతువేదిక వరకు ప్రత్యేక బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ డివిజన్ వ్యవసాయ అధికారులు ఏఈఓలు, నియోజకవర్గ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

కరుణాకర్ రెడ్డికి అరుదైన గౌరవం
స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన కరుణాకర్‌రెడ్డికి నారాయణఖేడ్‌లో అరుదైన గౌరవం దక్కింది. ఆయన పదవీ విరమణ కార్యక్రమమం అనంతరం స్థానిక ఫర్టిలైజర్ వ్యాపారులు, డివిజన్ పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేకంగా అలంకరించిన రథంపై కరుణాకర్‌రెడ్డి, ఆయన సతీమణి గీతను ఊరేగించారు. రథాన్ని వ్యాపారులు లాగి తమ అభిమానాన్ని చాటారు. రాజీవ్ చౌక్ వద్ద గజమాలతో సత్కరించారు. కాగా నారాయణఖేడ్‌లో గతంలో ఏ అధికారికి దక్కని గౌరవం కరుణకర్‌రెడ్డికి దక్కిందని స్థానికులు చర్చించుకున్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

సీఐటీయూ అందోల్ మండల కార్యదర్శి రెడ్డి విద్యాసాగర్



ఐసీడీఎస్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జోగిపేట(అందోల్): అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించి, ఆన్‌లైన్ విధానం రద్దు చేయడంతో పాటు గ్రాడ్యూటీ సౌకర్యం కల్పించాలని సీఐటీయూ అందోల్ మండల కార్యదర్శి రెడ్డి విద్యాసాగర్ అన్నారు. జనవరి 6వ తేదీన జరిగే స్కీం వర్కర్ల సమ్మెలో పాల్గొంటామని మంగళవారం జోగిపేట ప్రాజెక్ట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని చెబుతూ కాలయాపన చేస్తున్నాయన్నారు. గ్రామాలకు ప్రభుత్వ పథకాలు చేరడంలో, గర్భిణీ బాలింతలకు సేవలు చేయడంలో, గ్రామాలలో వైద్యం అందించడంలో స్కీం వర్కర్లు ప్రముఖ పాత్ర వహిస్తున్నారని చెప్పారు. స్కీమ్ వర్కర్లను తక్షణమే ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ జనవరి 6న జరిగే దేశవ్యాప్త సమ్మెలో స్కీమ్ వర్కర్లందరూ పాల్గొంటారనితెలిపారు. కార్యక్రమంలో అన్నారు అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి మంగమ్మ, ప్రాజెక్టు నాయకులు శేకమ్మ, అమల తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా టీఎల్‌ఎం మేళా



జహీరాబాద్‌లో ఉపాధ్యాయుల ప్రదర్శనలను తిలకిస్తున్న సీనియర్ సివిల్‌జడ్జి సూరిక్రిష్ణ



రాయికోడ్: బోధనోపకరణలను పరిశీలిస్తున్న హెచ్‌ఎం అంజయ్య

జహీరాబాద్: ఉపాధ్యాయులు తమ మేధస్సును విద్యార్థులకు పంచి వారిని విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలని సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ అన్నారు. మంగళవారం మెథడిస్టు పాఠశాలలో జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల ప్రభుత్వ విద్యాసంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల తొలిమెట్టు విజ్ఞాన సదస్సుకు హాజరై మాట్లాడారు. విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి విద్యాసంస్థలు ఎంతో దోహదపడుతున్నాయన్నారు.

రాయికోడ్(అందోల్): మండల కేంద్రం రాయికోడ్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం టీచర్స్ లెర్నింగ్ మెటిరియల్ మేళా నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు బోధన ఉపకరణాలను సిద్ధం చేశారు. అనంతరం విద్యార్థులకు వాటితో పాఠ్యాంశాలను వివరించారు. విద్యార్థులు ఉపకరణాలను శ్రద్ధగా తిలకించి అభ్యసించారు. ప్రధానోపాధ్యాయుడు అంజయ్య మాట్లాడుతూ పాఠ్యాంశాల బోధనలో సంబంధిత ఉపకరణాలతో బోధిస్తే విద్యార్థులకు చక్కగా అర్థమవుతాయన్నారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు టీఎల్‌ఎం మేళాలు ఉపయోగపడుతాయని జెడ్పీటీసీ సభ్యురాలు స్వప్నభాస్కర్ అన్నారు. మంగళవారం జెడ్పీహెచ్ఎస్‌లో ఎఫ్ఎల్ఎం తొలిమెట్టు మండల స్థాయి మేళా నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన పరికారలను ఎంఈఓ మారుతి రాథోడ్‌తో కలసి తిలకించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ విద్యార్థులు అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు బట్టీ విధానానికి స్వస్తి చెప్పాలన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధన చేయాలన్నారు.

వట్‌పల్లి(అందోల్): మండల కేంద్రంలో మంగళవారం బోధనోపకారణాల మేళాను నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా వట్‌పల్లి రైతువేదికలో నిర్వహించిన టీఎల్ఎం మేళాలో ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు తెలుగు, గణితం, ఇంగ్లిష్, ఎన్విరాన్‌మెంట్ సైన్స్‌పై రూపొందించిన 166కుపైగా ప్రయోగాలను ప్రదర్శించారు. మేళాను అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్లు వెంకటేశం, అనురాధ పరిశీలించారు.

మునిపల్లి(అందోల్): టీఎల్ఎమ్ మేళాలో మండల స్థాయిలో ఇంగ్లీష్‌లో మొదటి తెలుగు, ఈవీఎస్‌లో ద్వితీయ బహుమతులు సాధించిన విద్యార్థులకు హెచ్‌ఎం ఖమ్రొద్దీన్ అందజేశారు. మంగళవారం మండలంలోని ఖమ్మంపల్లి ప్రాథమిక పాఠశాలలో టీఎల్ఎం మేళ నిర్వహించారు.

మునిపల్లి(అందోల్): తొలిమెట్టు కార్యక్రమంలో ఆయా పాఠశాలల నుంచి సేకరించిన 180 నమూనాలను ఎంపీపీ శైలజా శివశంకర్, ఎంఈఓ దశరథ్, ఉపాధ్యాయులు ప్రదర్శించారు. మంగళవారం మండలంలోని మునిపల్లిలో బోధనోపకరణాల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. అంతారం ప్రాథమిక పాఠశాల, ఖమ్మంపల్లి పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మండలం నుంచి ప్రతి సబ్జెక్టుకు నాలుగు చొప్పున పదహారు ఉత్తమ ప్రదర్శనలను జిల్లా స్థాయికి పంపిస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు.

ఝరాసంగం(జహీరాబాద్): మండల కేంద్రమైన ఝరాసంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి టీఎల్ఎం (టీచర్ లర్నింగ్ మెటీరియల్) మేళాను ఏర్పాటు చేశారు. మంగళవారం మండల విద్యాధికారి శ్రీనివాస్, సర్పంచ్ జగదీశ్వర్ మేళాను ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 40 పాఠశాలల ఉపాధ్యాయులు, 150 రకాల ప్రదర్శనలు ఇచ్చినట్లు వివరించారు. తెలుగు, ఇంగ్లిష్, గణిత శాస్త్రం, పరిసరాల విజ్ఞానం శాస్త్రాలలో విద్యార్థులకు సులభమైన పద్ధతిలో అర్థమయ్యే విధంగా రూపొందించిన బోధన పరికరాలను ప్రదర్శించారు.

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని నాగధర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉమ్మడి కల్హేర్ మండల స్థాయి టీఎల్‌ఎం మేళా జరిగింది. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్, గణితం పరికరాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. జెడ్పీటీసీ నర్సింహారెడ్డి మేళాను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అలీ, ఎంఈఓ శంకర్, నాయకుడు గోపి పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మహిపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): అభివృద్ధి పనుల కోసం సర్పంచ్‌లు, అధికారులు బాధ్యతగా పనిచేయాలని సిర్గాపూర్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి కోరారు. మంగళవారం సిర్గాపూర్ మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. వివిధ సమస్యలపై సభ్యులు అధికారులతో మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత, వైస్ ఎంపీపీ ప్రయాగబాయి, సర్పంచ్‌లు సంజీవరెడ్డి, రవీందర్‌రావు పాల్గొన్నారు.

కల్హేర్‌లో..
అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని కల్హేర్ ఎంపీపీ గుర్రపు సుశీల ఆంజయ్య, జెడ్పీటీసీ నర్సింహారెడ్డి అధికారులను కోరారు. కల్హేర్ మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీఓ మంజుల, వైస్‌ఎంపీపీ నారాయణరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఘని, సర్పంచ్ రవీందర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఖేడ్ బీసీ సంఘం అధ్యక్షుడిగా శంకర్ యాదవ్**



ఆర్.కృష్ణయ్యను సన్మానిస్తున్న బీసీ నాయకులు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడిగా జి.శంకర్ యాదవ్ నియమితులయ్యారు. రాజ్యసభ సభ్యుడు సంఘ జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య నియామాక పత్రం అందించారు. ఈ సందరర్భంగా శంకర్ యాదవ్ మాట్లాడుతూ ఖేడ్ నియోజకవర్గంలో బీసీలను ఏకం చేసి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

◆ **గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం**
సంగారెడ్డి టౌన్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని బీఆర్ఎస్ పార్టీ సంగారెడ్డి మండల అధ్యక్షుడు చక్రపాణి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అంగడ్ పేటలో రూ.6 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామ పంచాయతీలో మౌలిక వసతుల కల్పన కోసం ఇటీవల రూ.20 లక్షల చొప్పునా మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అజయ్ కుమార్, వార్డు సభ్యులు అసీఫ్, వాజీద్, లక్ష్మయ్య, బీఆర్ఎస్ నాయకుడు పండరీగౌడ్, మాజీ వార్డు సభ్యుడు మునావర్ అలీ, ఉస్మాన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **వైఎస్సార్ తెలంగాణతోనే అభివృద్ధి సాధ్యం**
సదాశివపేట రూరల్(సంగారెడ్డి): వైఎస్సార్ తెలంగాణ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ జిల్లా యూత్ కోఆర్డినేటర్ లక్ష్మారెడ్డిగారి సాయినాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆరూరు సూరారం, తంగడపల్లి తండ, మెల్గిర్ పేట గ్రామాల్లో గడపగడపకు వైఎస్సార్ తెలంగాణ పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువకులు, విద్యార్థుల బలిదానాలపై ఏర్పడ్డ తెలంగాణలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రంగల్ల రమేశ్, పార్టీ యువజన నాయకులు శివాజీ నాయక్, కిరణ్ నాయక్, కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **మంత్రిని కలిసిన కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు**



మంత్రికి పుష్పగుచ్ఛంఇస్తున్న బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు శివశంకరరావు

హత్నూర(సంగారెడ్డి): రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావును బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు శివశంకరరావు మంగళవారం కలిసినట్లు స్థానిక నాయకులు తెలిపారు. కార్మికుల సమస్యలపై చర్చించడంతోపాటు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపినట్లు చెప్పారు.

◆ **విద్యార్థులకు బహుమతుల ప్రదానం**



హత్నూర (సంగారెడ్డి): గత ఏడాది మే 2వ తేదీన గుండెపోటుతో మృతి చెందిన మండలంలోని బోరపట్ల పురోహితుడు దివంగత నందకుమార్ జ్ఞాపకార్థం విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. మంగళవారం ఆయన సతీమణి బోరపట్ల రమాదేవి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు చేతి గడియారాలు తదితర బహుమతులను అందజేశారు. వచ్చే పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ గ్రేడ్ సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాన్ని కూడా అందించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎం.హైమావతి, ఉపాధ్యాయులు, పీఈటీ తేజేందర్ సింగ్ పాల్గొన్నారు.

◆ **డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి**
నారాయణఖేడ్: ప్రభుత్వం వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని నారాయణఖేడ్ డివిజన్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం అధ్యక్షులు ఎన్.సంతోష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఆరేళ్లుగా మూడు లక్షల మంది అభ్యర్థులు టెట్ క్వాలిఫై అయ్యి డీఎస్సీ నోటిఫికేషన్‌కోసం ఎదురు చూస్తున్నారన్నారు. తల్లిదండ్రులపై ఆధారపడి దుర్భర జీవితాలను గడుపుతన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉన్నందున వెంటనే భర్తీ చెయ్యాల్సిన అవసరం ఉందన్నారు.

◆ **కాస్మొటిక్ చార్జీలు పెంచాలి**
నారాయణఖేడ్: పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలను వెంటనే పెంచాలని నారాయణఖేడ్ డివిజన్ ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవల్లి రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం అందచేసి తమ నిరసనను తెలిపారు. విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలు చాలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.